## క్లుప్తంగా

### పదిలో ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందన

నెహ్రూ నగర్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 21వ డివిజన్ పరిధిలోని కొల్లి శారద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ప్రభు చరణ్ 560 మార్కులతో స్కూల్ టాపర్ గా నిలవడంపై స్థానిక కార్పొరేటర్ కాంట్రగుంట గురవయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కేవీపీ కాలనీలో విద్యార్థికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించటం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి కింద రూ.10వేలు అందజేశారు.

### ఇది దళిత వ్యతిరేక ప్రభుత్వం..

నెహ్రూనగర్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో కాపు కులస్తులు, దళితులను వెలివేస్తే పవన్ కల్యాణ్ ఒక్క మాట మాట్లాడకపోవడం సిగ్గుచేటని ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని ఎమ్మార్పీస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చందోలు శశికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుల వివక్షకు గురై వెలివేయబడిన దళితుల సాంఘిక బహిష్కరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు సుమోటోగా క్రిమినల్ కేసును స్వీకరించడం హర్షించదగ్గ విషయమని చెప్పారు.

### 5వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై సీబీఐతో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్(ఐక్య) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోళ్ల మూడి రాజసుందరబాబు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ప్రారంభించిన క్రైస్తవుల రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతిబాబు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్రైస్తవ మిషనరీలపై, పాస్టర్లపై, చర్చిలు అనేక దాడులు జరుగుతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎంతైన ఉందన్నారు. కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు కొండపల్లి విల్సన్, శరత్ బాబు, బాబురావు, బండ్ల కాంతారావు, రాజు, యిర్మియా పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మకు సన్మానం



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా కోనూరు సతీష్ శర్మ ఎన్నికైన సందర్భంగా ఆదివారం గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజీలో ఆల్ ఇండియా బ్రాహ్మిన్ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడు వెలవర్తిపాటి పాండురంగ విఠల్ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా ఫెడరేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, నాయకులు చందు సాంబశివరావు, టీడీపీ నాయకులు కోవెలమూడి రవీంద్ర, పాటిబండ్ల విజయ్, ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రి(జ్వరాల ఆస్పత్రి) సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకంటి రఘు తదితరులు పాల్గొని మాట్లాడారు. వక్తలు ప్రసంగిస్తూ సతీష్ శర్మ గత 25 సంవత్సరాలుగా అకుంఠిత దీక్షతో బ్రాహ్మణ సమాజ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. అతి సాధారణ స్థాయి నుంచి నేడు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదగడం సంతోషించదగిన విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శంకరమంచి లలిత శాస్త్రి, ప్రధాన కార్యదర్శి మాచిరాజు మురళీ కృష్ణ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొని గజమాలతో సత్కరించారు.

### 30న ప్లాటినం జూబ్లీ భవన ప్రారంభోత్సవం

పెదకాకాని: విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు మనం కూడా తిరిగి ఇవ్వాలని చేసిన మంచి ఆలోచనే ప్లాటినం జూబ్లీ భవనం అని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఈమని ప్రతాపరెడ్డి అన్నారు. మండలంలోని నంబూరు శ్రీ పోలయ వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ప్లాటినం జూబ్లీ భవనం ఈనెల 30న ప్రారంభోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. నంబూరు గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రారంభించి 2021 నాటికి 75 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికగా 2022 సంవత్సరం మార్చిలో ప్లాటినం జూబ్లీ వేడుకలు ఘనంగా జరుపుకోవడం జరిగిందన్నారు. ఈ వేడుకలు నిర్వహించగా రూ.11.93 లక్షలు మిగిలాయని.. ఆ నగదుతో పాటు పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షల వ్యయంతో భవనం నిర్మించినట్లు పేర్కొన్నారు.

# కిడ్నీలు మొరాయిస్తున్నాయి..

'పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన శ్రీనివాసరావు ప్రైవేటు కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఎండను లెక్కచేయకుండా బైక్‌పై తిరుగుతున్నాడు. ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి వెళ్లగా కిడ్నీలు దెబ్బతినడం ప్రారంభమయ్యాయని నెఫ్రాలజిలస్టులు నిర్ధారించారు'. వేసవిలో జాగ్రత్తలు తీసుకోకపోతే కిడ్నిలు పూర్తిగా పాడవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా ఉద్యోగస్తులు, రోజువారి కూలీలు, తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారు ఎక్కువగా ఎండలో ఉండి విధులు నిర్వహించే వారు వేసవిలో కిడ్నీలు దెబ్బతినకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని నెఫ్రాలజిస్టులు సూచిస్తున్నారు.



మూత్ర పిండాలు

- అధిక ఉష్ణోగ్రతలతో తీవ్ర ప్రభావం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

గుంటూరు మెడికల్: కొద్దిరోజులుగా ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. వడగాడ్పులు బాగా వీస్తున్నాయి. భానుడు తన ప్రతాపం చూపిస్తూ ఉండటంతో కొద్దిరోజులుగా ప్రజలు ఎండలతో అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే రెంటచింతల గ్రామం, ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉంది. ఎండలను లెక్కచేయకుండా ఉపాధికోసం, ఉద్యోగాల కోసం ఎండలో తిరిగితే రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. ఎండలో విపరీతంగా తిరగటంతో శరీరంలో లవణాలు తగ్గిపోయి (పొటాషియం, సోడియం లెవల్స్) కిడ్నీలు పనిచేయవు. కిడ్నీలు ఫెయిల్ అవ్వకుండా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

ప్రతిరోజూ తప్పనిసరిగా ఒంటికి సరిపడ నీటిని తీసుకోవాలి. కాటన్, తేలికపాటి వస్త్రాలు ధరించాలి. నోరు, గొంతు పొడిబారడం, మూత్ర విసర్జన తగ్గడం, లేదా ముదురు రంగు మూత్రం రావడం, అలసట పెరగడం, మైకం, కండరాల తిమ్మిరి, వేగవంతమైన హృదయ స్పందనలు ఉంటే తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండి ఎక్కువ నీటిని తాగాలి. సూర్యరశ్మిలో లేకుండా నీడనే ఉండాలి. నీరు, పండ్ల రసాలు బాగా తీసుకోవాలి. శీతల పానీయాలకు దూరంగా ఉండాలి. ఉప్పు, కొవ్వు, చక్కెర తక్కువగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆహారాలు తీసుకోవడం ద్వారా మూత్ర పిండాలు దెబ్బతినకుండా ఉంటాయి.

### కిడ్నీ రోగులు ఎండలో తిరగకూడదు...



కిడ్నీ రోగులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో తిరుగకూడదు. సాధారణ ప్రజలు ఎండకు సరిపడా మంచినీరు తాగకపోతే కిడ్నీలు రాళ్లు ఏర్పడి బాధిస్తాయి. రోజూ కనీసం నాలుగు నుంచి ఐదు లీటర్లు నీటిని తాగటం వలన కిడ్నీలు కాపాడుకోవచ్చు. ఎండలో కూలిపనులు చేసేవారికి వడదెబ్బ తగిలి కిడ్నీలు ఫెయిల్ అవుతాయి. ఎండలు తగ్గే వరకు ప్రతి ఒక్కరూ ఎండలో తిరుగకుండా ఏమైనా పనులు ఉండే సాయంత్రం వేళల్లో చేసుకోటం ద్వారా కిడ్నీలను దెబ్బతినకుండా కాపాడుకోవచ్చు.

– డాక్టర్ చింతా రామకృష్ణ,
సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

### కిడ్నీ రోగులు జాగ్రత్తలు తీసుకోవాలి...



కిడ్నీ జబ్బుతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునేవారు వేసవిలో ఎక్కువగా నీటిని తాగుతారు. ఫలితంగా ఆయాసం ఎక్కువై వారంలో ఒకరోజు డయాలసిస్ చేయించుకునేవారు వారంలో రెండు లేదా మూడుసార్లు చేయించుకోవాల్సి వస్తుంది. దీని నివారణ కోసం ఐస్‌క్యూబ్స్‌ను వినియోగించటం వలన దాహం వేయకుండా ఉంటుంది. వేసవిలో కిడ్నీ రోగులు తప్పనిసరిగా వైద్యుల సలహాలు పాటించాలి. జీజీహెచ్‌లో కిడ్నీ వ్యాధులకు కార్పొరేట్ వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు.

– డాక్టర్ గొంది శివరామకృష్ణ,
నెఫ్రాలజీ విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్

### అ'పూర్వ' కలయిక



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఎస్వీఎన్ కాలనీలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈసందర్భంగా గుంటూరు నగరంతో పాటు హైదరాబాద్, బెంగళూరు, మైసూరు తదితర ప్రాంతాల నుంచి పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. 20 ఏళ్ల తరువాత సహచరులను కలుసుకున్న ఆనందంలో మునిగి తేలారు. నాడు విద్యార్థి దశలో చేసిన అల్లరి, ఉపాధ్యాయులు అలవర్చిన క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య తమ భావి జీవితానికి బాటలు వేశాయని గుర్తు చేసుకున్నారు. సహచర విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకురావాలనే లక్ష్యంతో బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తాము రెండు నెలల నుంచి చేసిన ప్రయత్నం ఇంత కాలానికి ఫలించిందని అనూష, సుధారాణి, నాగేంద్ర బాబు, దుర్గారావు, నరేంద్ర, సాంబ శివరావు, నూకా రమేష్, ఉషారాణి, వెంకట మురళి చెప్పారు. పూర్వ విద్యార్థులు ముగ్గురు హైకోర్టు న్యాయవాదులతో పాటు మరో ముగ్గురు సీఏలు, వివిధ వృత్తి, వ్యాపారాలు చేస్తున్న వారు ఉన్నారు. మొత్తం 120 మంది విద్యార్థుల్లో సమ్మేళనానికి హాజరైన 100 మంది పూర్వ విద్యార్థులు సమావేశ అనంతరం తాము విద్యనభ్యసించిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌ను సందర్శించారు. గతంలో ఎయిడెడ్‌లో కొనసాగిన పాఠశాల ప్రస్తుతం సీబీఎస్ఈ పాఠశాలగా ఎదిగి, ఆధునిక వసతులతో అభివృద్ధి బాట పట్టిన తీరును చూసి మురిసిపోయారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్‌ను కలిసి, పాఠశాలను తీర్చిదిద్దిన తీరుపై అభినందనలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఫొటోలు దిగారు.

### మొదలైన వార్షిక మహోత్సవాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో కొలువుదీరిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య సమేత అమ్మవారి 27వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు దండిబొట్ల కృష్ణ శర్మ, మాధవశర్మలు అఖండ జ్యోతి స్థాపనతో వేడుకలను ప్రారంభించారు.

# ప్రగతినగర్.. అభివృద్ధిలో అధోగతి

- ఇప్పటికి మట్టి రోడ్లపైనే రాకపోకలు..
- కనిపించని మురుగు కాలువ
- ఏళ్లుగా కనీస వసతులు కరువు



మట్టి రోడ్డుగా మారిన ప్రగతినగర్ ఒకటో వీధి

నగరంపాలెం: నగరంలోని కాలనీలపై పాలకులకు శ్రద్ధ లేదు. కనీస వసతులు గురించి పట్టించుకోవడం లేదు. ఏళ్ల కిందటే కాలనీలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నా వసతుల గురించి పట్టించుకునే నాథుడే కరువవుతున్నారు. గత ఎన్నికల ముందు స్థానికంగా పర్యటించి, ప్రస్తుతం గెలిచిన కూటమి పాలకులు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీలు గుప్పించారు. అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**కాలనీలో పరిస్థితి..**

జీఎంసీ పరిధిలోని మూడో డివిజన్ ప్రగతినగర్ 2007లో ఏర్పాటై సుమారు 18 ఏళ్లు గడిచింది. ఇక్కడ 17 వీధులు, సుమారు 1,500 మంది కుటుంబాలు నివసిస్తున్నాయి. తొలినాళ్లల్లో కనీస మౌలిక సౌకర్యాల్లే వు. ఈ ప్రాంతంలో నివసించే వారంతా చాలా వరకు రోజు వారీ కూలీ పనులకు వెళ్లేవారు. ఉదయం పనులకెళ్తే సాయంత్రానికి ఇళ్లకు వస్తారు. పనులు చేసి వచ్చి కాస్తంత ప్రశాంతంగా ఉందామంటే స్థానిక సమస్యలు వెంటాడుతాయి. ఏళ్లు గడిచిన కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో తాత్సరం చేస్తున్నారు.

**అధ్వానంగా రోడ్లు..**

ఇప్పటికీ మట్టిరోడ్లపైనే రాకపోకలు చేయాల్సింది. ఆ రహదారులపై గృహాలకు సంబంధించి మెటీరీయల్‌తో కావడంతో ఎత్తు పల్లాలుగా ఉంటాయి. నడిచేటప్పుడు నెమ్మదిగా నడవాల్సిందే. ఇక మోటారు సైకిళ్లపై వచ్చే పోయేటప్పుడు ఏమాత్రం వేగంగా వెళ్లిన ప్రమాదవశాత్తు కిందపడిపోవాల్సిందే. కొన్ని రహదారుల మధ్యలో గడ్డిమొక్కలు ఏర్పడటంతో మరో రహదారిపై రాకపోకలు చేయాల్సి వస్తోంది. వర్షకాలం వస్తే నరకయాతన పడాల్సిందే. అడుగు తీసి అడుగు వేయ లేని పరిస్థితులు ఏర్పడతాయి.



ఇది ఖాళీ స్థలంకాదు..
ఐదో వీధిలో పెరిగిన గడ్డి మొక్కలు

**మురుగు ముందుకు కదలదు..**

ఇక సైడు కాల్వల తీరు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇళ్లల్లో నుంచి వచ్చే వృథా నీరు బయటకు వెళ్లేందుకు సరైన కాల్వల్లేవు. దీంతో ఇళ్లల్లో నుంచి బయటకొచ్చిన నీరంతా అక్కడకక్కడే నిలిచిపోతుంది. మురుగు పారుదల ఉండదు. తద్వారా భరించలేని దుర్గంధం వెదజల్లుతుంది. అంటువ్యాధులు ఏమైనా వస్తాయని భయంగా ఉందని స్థానికులు అంటున్నారు. కాల్వల్లో గడ్డిమొక్కలు పెరిగాయి.

**ప్రతి ఇంటి వద్ద డ్రమ్ములే..**

ఇక తాగునీటి వ్యవస్థ మరింత దారుణంగా ఉంది.



ప్రతి ఇంటి ముందు కనిపించే నీటి డ్రమ్ములు

సుద్దపల్లిడొంక, బాలాజీనగర్ వైపు వెళ్లే ప్రధాన తాగునీటి పైపులైన్లు ఉన్నప్పటికి, ఈ ప్రాంతంలో గుక్కెడ తాగు నీరు ఉండదు. దీంతో అప్పుడప్పుడు వచ్చే జీఎంసీ తాగునీటి ట్యాంకర్ల వద్ద మంచినీళ్లు పట్టుకోవాల్సిందే. తాగునీటి ట్యాంకర్లు కూడా ఒక ట్రెండు రోజుల తర్వాత వస్తుంటాయి. ట్యాంకర్లరు వచ్చినప్పుడు ఇళ్ల వద్ద పనులు మానుకుని తాగు నీరు పట్టుకోక తప్పదు. లేనిచో ఆ రెండు రోజులు ఇంటి అవసరాలకు, తాగే నీటికి ఇబ్బందులు పడాల్సిందే. దీంతో ప్రతి గడప వద్ద రెండు మూడు డ్రమ్ములు ఏర్పాటు చేసుకున్నారు.

**అమలుకాని హామీలు..**

గత ఎన్నికల ముందు ప్రస్తుత కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ పర్యటించారు. ఎన్నికల్లో గెలిచాక ఈ ప్రాంతంలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని స్థానికులు గుర్తుచేశారు. ఈ ఏడాది ఉగాది పండుగ తర్వాత యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామని చెప్పారని వారు తెలిపారు.

**రాకపోకలకు ఇబ్బందులు**



చాన్నాళ్లుగా ఇక్కడ ఉంటున్నాం. రహదారులు అధ్వానంగా మారాయి. మట్టి రోడ్లు కావడంతో రాకపోకలు చేసే వేళల్లో నెమ్మదిగా నడవాల్సిందే. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న రాళ్ల ధాటికి కిందపడిపోవాల్సిందే. ఇక మురుగు కాల్వల్లేవు. కనీసం కచ్చాకాల్వలైనా తీస్తే ఇళ్లల్లో నుంచి వచ్చే వృథా నీరు బయటకు వెళ్లేందుకు అవకాశాలు ఉన్నాయి.

–అచ్చమ్మ, స్థానికురాలు..

**శాశ్వత దిశగా చర్యలు తీసుకోవాలి**



తాగునీటికి ఇబ్బందిగా ఉంది. జీఎంసీ తాగునీటి ట్యాంకర్లు వస్తున్నాయి. అయినప్పటికీ శాశ్వత దిశగా తాగునీటి పైపులైన్ల వ్యవస్థను ఏర్పాటుచేస్తే నీటికి ఇబ్బందులు ఉండవు. బాలాజీనగర్, సుద్దపల్లిడొంక వైపు తాగు నీటి పైపులైన్లు ఉన్నాయని, వాటి ద్వారానైనా ఈ ప్రాంతంలో వారికి నీటి కొళాయిలు ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

– సయ్యాద్ ఇమామ్, స్థానికుడు

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పట్నంబజారు: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు అయింది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. జియావుద్దీన్ నగర్‌లో నివాసం ఉండే అంబటి రవికుమార్ (42) భార్యాభర్తల మధ్య వివాదం ఉన్న నేపథ్యంలో గత పది సంవత్సరాలుగా వేరుగా ఉంటున్నారు. దీనితోపాటు ఆయనకు ఫిట్స్ కూడా ఉంది. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసి పడుకున్న అతను సాయంత్రం ఇంట్లోనే మృతి చెంది పడి ఉన్నాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లిన క్రమంలో వైద్యులు రవికుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు తల్లి శివ కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మజ్జిగ పంపిణీ



గుంటూరు మెడికల్: వేసవి తాపానికి ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో రవి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఆదివారం స్థానిక మాయాబజార్ సెంటర్ ఈస్ట్ పారిస్ చర్చి దగ్గర చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపశమనం కలిగించడమే కాకుండా సమాజంలో మంచి మార్పుకు బాటలు వేయాలనే ధ్యేయంతో ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు. సుమారు ఎనిమిది వేల మందికి ఉచిత మజ్జిగ పంపిణీకి ఏర్పాటు చేశామన్నారు.

# పహల్గామ్ ఉగ్రవాద దాడి బాధితులకు నివాళి

**కొవ్వొత్తులతో మార్చ్ నిర్వహించిన రైల్వే, స్కౌట్స్ అండ్ గైడ్స్**




కొవ్వొత్తులతో ఉగ్రవాద దాడి బాధితులకు నివాళులర్పిస్తున్న గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం సుథేష్ణ సేన్, ఏడీఆర్ఎం సైమన్

లక్ష్మీపురం: పహల్గామ్ ఉగ్రవాద దాడికి నిరసనగా దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్, సౌట్స్ అండ్ గైడ్స్ కొవ్వొత్తుల మార్చ్ నిర్వహించి నివాళులర్పించారు. గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల మార్చ్‌ను గుంటూరు రైల్వే స్టేషన్ వరకు డివిజన్ డీఆర్ఎం సుథేష్ణసేన్, ఏడీఆర్ఎం సైమన్, సౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సుథేష్ణ సేన్ మాట్లాడుతూ భారతీయులపై పహల్గామ్ ఉగ్రవాద దాడి'ని ఖండిస్తూ కొవ్వొత్తుల మార్చ్ చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మార్చ్‌ను భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, నేషనల్ హెడ్క్వార్టర్స్ పాల్గొని నివాళులరిపంచడం జరిగిందన్నారు. ఉగ్రవాద దాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు దేశ వ్యాప్తంగా వారికి పూర్తి సహయ సహకారాలు ఉంటాయని ఆధైర్యపడవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్, రైల్వే సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, సిబ్బంది, జిల్లా సెక్రటరీ షహబాజ్ హనూర్ రైల్వే డివిజన్ అధికారులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

**పహల్గామ్ దాడి పిరికిపంద చర్య**

నగరంపాలెం: కశ్మీర్ పహల్గమ్‌లో పర్యాటకులపై జరిగిన అమానుష దాడి పిరికిపంద చర్య అని గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, భానుప్రసాద్ అన్నారు. పహల్గమ్ దాడిని నిరసిస్తూ గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ట్రాక్ ఆవరణలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూర్చడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న కూకటివేళ్ళతో సహా పెకలించాలని చెప్పారు. టెరర్రిస్ట్ కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి శంకరరావు, సభ్యులు రాయల శ్రీను, అశోక్‌రెడ్డి, సదాశివరెడ్డి, వాకర్స్ పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన

# కీళ్లవాతంపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ మురళీకృష్ణ**




మాట్లాడుతున్న డాక్టర్ మురళీ కృష్ణ

లక్ష్మీపురం: సాధారణంగా జాయింట్ పెయిన్స్ సమస్య వచ్చినప్పుడు ఆర్థోపెడిక్, న్యూరాలజీ వైద్యులను సంప్రదిస్తుంటారని వాటిల్లో రుమటాలజీకి సంబంధించిన సమస్య గుర్తించకుంటే కాలయాపన చేస్తే వ్యాధి తీవ్రత పెరిగి ఇబ్బందులకు గురి అవుతున్నారని ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ మాట్లాడుతూ జాయింట్ పెయిన్స్ సమస్య అనిపించినప్పుడు సాధ్యమైనంత త్వరగా రుమటాలజిస్టును సంప్రదించడం మంచిదని సూచించారు. పెద్దవాళ్లలో ముఖ్యంగా మెడ నొప్పి, నడుము నొప్పి, మోకీలు, కీళ్లవాతం లాంటి సమస్యలను చూస్తుంటామన్నారు. రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనగా కీళ్లవాతం ఉన్నవారు బంగాళదుంప, చిలకడ దుంప, శనగపిండి, మాంసాహారం, పులుపు వస్తువులు, పప్పు లాంటి ఆహార పదార్థాలు తీసుకోరాదని అన్నారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా అనవేమ ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, రాడికల్ హ్యూమనిస్ట్ కె.చంద్రశేఖర్, విశ్రాంత ఆంధ్రాబ్యాంక్ మేనేజర్ ఫణీంద్ర కుమార్ పాల్గొని ప్రసంగించారు. అనంతరం డాక్టర్ మురళీకృష్ణను సత్కరించారు.

### నగదు, బంగారం చోరీ

చేబ్రోలు: ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారు వస్తువులు అపహరించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. .. ప్రెసిడెన్సీ హైస్కూల్ రోడ్డులోని దారం అప్పారావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో రూ.40 వేలు, బంగారు ఆభరణాలు మాయమైయ్యాయని.. సుమారు రూ.లక్ష వరకు చోరీకి గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు.

### బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సన్మానం

పొన్నూరు: పట్టణంలోని ఎ.పి.జె అబ్దుల్ కలాం షాదీఖానాలో ఆదివారం అంజుమన్ కమిటీ కార్యవర్గం మొదటి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అంజుమన్ అధ్యక్షులు మగ్బుల్ బేగ్ అధ్యక్షత వహించారు. అంజుమన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఇటీవల పొన్నూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన షేక్.బాజీ, బులియన్ మర్చంట్ అసోసియేషన్ కార్యదర్శి షేక్.బాజీ బాబా, కోశాధికారి మహమ్మద్ ఖాసింలను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పొన్నూరు అంజుమన్ కమిటీ కార్యదర్శి షేక్.బాజీ, కోశాధికారి మహమ్మద్ గౌస్, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

